సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 24 । నవంబర్ । 2023



జగనన్న కాలనీల్లో వేగంగా ఇళ్ల నిర్మాణం
జగనన్న కాలనీల లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. - 8లో..



భూ వివాదాల్లో లోతుగా విచారణ
భూ వివాదాల్లో లోతుగా విచారణ చేసి నిందితుల్లో ఉద్యోగస్తులుంటే ఆయా శాఖలకు రిపోర్టు చేయాలని ఎస్పీ మలికాగర్గ్ పోలీసు అధికారులను ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31/24

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పశు సంరక్షణ కార్డులు అందించాలి



కార్డులు అందజేస్తున్న అడిషనల్ డైరెక్టర్ వెంకటరావు

నాగులప్పలపాడు: జిల్లాలోని పశు పోషకులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులను సాధ్యమైనంత త్వరగా అందజేయాలని అడిషనల్ డైరెక్టర్, జిల్లా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరావు ఆదేశించారు. గురువారం నాగులప్పలపాడు ఏరియా పశువైద్యశాలలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. పశు ఆరోగ్య సంరక్షణ కార్డుల వలన కలిగే ఉపయోగాలను వివరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎ.బేబిరాణి, ఉపసంచాలకులు డాక్టర్ రమేష్‌బాబు, సహాయ సంచాలకులు డాక్టర్ నాగభూషణరావు పాల్గొన్నారు.

తెలుగు కవుల చిత్రపటాల ఆవిష్కరణ



కొనకనమిట్ల: మండలంలోని మర్రిపాలెం జెడ్పీ హైస్కూల్లో 150 మంది తెలుగు కవుల చిత్రపటాలను గురువారం ఆవిష్కరించారు. హెచ్‌ఎం ఎస్.నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండ్లా రామాంజనేయులు, ఎం.జయకృష్ణ మాట్లాడుతూ.. ప్రాచీన, ఆధునిక కవుల చిత్రపటాలు విద్యార్థులకు చూపడం ద్వారా వారిలో మాతృభాషపై గౌరవం, అభిమానం, ఆసక్తి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లెల్లో సకల సేవలు అందుబాటులోకి తెచ్చింది రాష్ట్ర ప్రభుత్వం. వాటిని మరింత పక్కాగా ప్రజల చెంతకు చేర్చేందుకు చేపట్టిన సొంత భవనాల నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. గ్రామ సచివాలయాలు, రైతులకు వ్యవసాయ సంబంధిత సలహాలు, సహాయం కోసం రైతు భరోసా కేంద్రాలు, గ్రామాల్లో మెరుగైన వైద్యం సత్వరం అందించేందుకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. రానున్న రెండు నెలల్లో వీటి నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేందుకు జిల్లా అధికారులు దృష్టి సారించారు.

సింగరాయకొండ మండలంలో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే, సచివాలయం, హెల్త్ క్లినిక్ భవనాలు



రాపర్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న పీఆర్ ఎస్‌ఈ కొండయ్య

పల్లె సేవకు...

ఒక్కొక్క భవనానికి వెచ్చిస్తున్న మొత్తం...

గ్రామ సచివాలయం	రూ.43.60లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ.23.94లక్షలు
వైఎస్సార్ హెల్త్ క్లినిక్	రూ.20.80లక్షలు

- వేగంగా సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలు
- 1,380 భవనాల్లో 920 నిర్మాణాలు పూర్తి
- రూఫ్ లెవల్ పైస్థాయిలో 460 నిర్మాణాలు
- ఇప్పటి వరకు రూ.284 కోట్లు చెల్లించిన ప్రభుత్వం
- బిల్లులు అప్‌లోడ్ చేసిన వెంటనే నిధుల విడుదల
- రెండు నెలల్లో నిర్మాణాలు పూర్తిచేయాలని లక్ష్యం

ఒంగోలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు సొంత భవనాల నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది. ఈ ఏడాది చివరి నాటికి భవన నిర్మాణాలన్నీ పూర్తి కావాలనే ఆదేశాలతో పనులు ఊపందుకున్నాయి. ఈ మూడు అంశాలకు సంబంధించి మొత్తం 1,380 భవనాలు నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే 920 పూర్తయ్యాయి. రూఫ్ లెవల్ పైస్థాయిలో 460 నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇందులో 400కుపైగా నిర్మాణాలు పూర్తి కావస్తున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. డిసెంబరు నాటికి రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, జనవరి నాటికి గ్రామ సచివాలయ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలను ప్రభుత్వం జారీ చేసింది. ఆ తర్వాత బల్క్ మిల్క్ యూనిట్లు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలపై దృష్టి సారించనుంది. ఇవన్నీ పూర్తయితే గ్రామాల్లో కొత్త అందాలు సంతరించుకోనున్నాయి.

నిధుల కొరత లేదు...

జిల్లాలో చేపట్టిన ప్రాధాన్యత భవన నిర్మాణాలకు సంబంధించి ఎలాంటి నిధుల కొరత లేదు. చేసిన పనులకు బిల్లులు అప్‌లోడ్ చేసిన వెంటనే ప్రభుత్వం విడుదల చేస్తోంది. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు నిర్ణీత సమయంలోగా వీటిని పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటి వరకు ఈ భవన నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం దాదాపు రూ.284 కోట్లు చెల్లించింది. రూఫ్ లెవల్, రూఫ్ లెయిడ్, సెకండ్ స్లాబ్, ఫినీషింగ్, ఫిజికల్లీ కంప్లీటెడ్ దశల్లో ఉన్న నిర్మాణాలను అత్యంత ప్రాధాన్యతగా స్వీకరించి భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచారు.

అంశాల వారీగా నిర్మాణాలు ఇలా...

జిల్లాలో మొత్తం 531 గ్రామ సచివాలయ భవన నిర్మాణాలు నిర్మించాల్సి ఉండగా 377 పూర్తయ్యాయి. రూఫ్ లెవల్, ఫిజికల్లీ కంప్లీటెడ్, రూఫ్‌లెయిడ్, సెకండ్ స్లాబ్ తదితర దశలో ఉన్న 154 భవనాల పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే రైతు భరోసా కేంద్రాల్లో 484 లక్ష్యం కాగా, 362 పూర్తయి 122 రూఫ్ లెవల్ పైస్థాయిలో ఉన్నాయి. వైఎస్సార్ హెల్త్ క్లీనిక్స్ మొత్తం 365 లక్ష్యం కాగా, 181 పూర్తియి 184 రూఫ్ లెవల్ పైస్థాయిలో ఉన్నాయి. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులు లక్ష్యాలను నిర్ణయించారు.

ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసేందుకు చర్యలు...

భవన నిర్మాణాలను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసేందుకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఉన్నతాధికారులు వారంలో రెండు రోజులు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి బుధవారం పీఆర్ స్పెషల్ సెక్రటరీ, గురువారంగానీ, శనివారంగానీ ప్రభుత్వ సీఎస్ సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా కలెక్టర్ దినేష్‌కుమార్ భవన నిర్మాణాల పురోగతిపై రెగ్యులర్‌గా సమీక్షిస్తున్నారు.

చేసిన పనులకు చేసినట్లుగా బిల్లులు



భవన నిర్మాణాలకు సంబంధించి ఎలాంటి నిధుల కొరత లేదు. చేసిన పనులకు చేసినట్లు బిల్లులు విడుదలవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణీత సమయంలోగా నిర్మాణాలు పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. భవన నిర్మాణాలకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులకు ప్రతిరోజూ టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నాం.

– కొండయ్య, ఎస్‌ఈ, పంచాయతీరాజ్

నేడు నిర్వహించాల్సిన స్పందన రద్దు

ఒంగోలు సెంట్రల్: దొనకొండలో ఈ నెల 24వ తేదీ నిర్వహించతలపెట్టిన జగనన్నకు చెబుదాం (మండల స్థాయి ప్రత్యేక స్పందన) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా స్పందన విభాగం సూపరింటెండెంట్ డి.నాగజ్యోతి తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామనే తేదీని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. దొనకొండ మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఒక ప్రకటనలో కోరారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయండి

- పురోగతిపై సమీక్షించిన కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు సెంట్రల్: ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవనంలోని సమావేశపు మందిరంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణాలు పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్య భవనాలైన సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లను నిర్దేశించిన గడువులోగా తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. వారాంతపు లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని చెప్పారు. స్పష్టమైన పురోగతి కనిపించేందుకు డీఈలు ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో సిబ్బందిని సమన్వయం చేసుకోవాలని కోరారు. సమస్యలు పరిష్కరించి పనులు వేగవంతంగా జరిగేందుకు అధికారులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఏజెన్సీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. పూర్తయిన భవనాలను సంబంధిత శాఖలకు వెంటనే అప్పగించాలని ఆదేశించారు. మండలాల వారీగా భవన నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్‌ఈ కొండలు, ఈఈలు, డీఈలు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- వైఎస్సార్ కళ్యాణమస్తు, తోఫాతో పేద కుటుంబాల్లో సంతోషం
- కలెక్టర్ దినేష్‌కుమార్
- చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి, మేయర్ గంగాడ

ఒంగోలు అర్బన్: పేద కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లి ఖర్చు వారి తల్లిదండ్రులకు భారం కాకుండా గౌరవంగా వివాహం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థికసాయం అందిస్తోందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్ కళ్యాణమస్తు–వైఎస్సార్ తోఫా పథకంతో పేద కుటుంబాల్లో సంతోషం నెలకొంటుందన్నారు. ఈ పథకంలో భాగంగా నాలుగో విడత లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించేందుకు గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒంగోలులోని ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం పథకం లబ్ధిదారులకు బ్యాంకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద కుటుంబాల్లో బాల్య వివాహాలను నివారించడంతో పాటు ఆడపిల్లల పెళ్లి ఖర్చు తల్లిదండ్రులకు భారం కాకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు ఈ పథకం ద్వారా ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిపొందాలంటే అబ్బాయి, అమ్మాయి ఇద్దరూ కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై అమ్మాయికి 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాల్సి ఉందన్నారు. ఈ పథకం కింద ప్రస్తుతం నాలుగో విడత జిల్లాలో 593 మంది లబ్ధిదారులకు రూ.4,91,65,000 లబ్ధి చేకూరిందన్నారు. వీరిలో 23 మంది కులాంతర వివాహాలు చేసుకున్నారని తెలిపారు. మొత్తం నాలుగు విడతల్లో కలిపి 1,572 మంది లబ్ధిదారులకు రూ.12,93,30,000 ఆర్థిక ప్రయోజనం చేకూరిందని వివరించారు. బాల్య వివాహాల్లో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో ఉందని తెలిపారు. ఆడపిల్లలను భారంగా భావించకుండా కనీసం 18 ఏళ్లు నిండే వరకు చదివించాలని తల్లిదండ్రులకు కలెక్టర్ సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటోందని తెలిపారు. వారి సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కళ్యాణమస్తు, తోఫాతో పేద కుటుంబాల తల్లిదండ్రులకు ఎంతో ఊరట లభిస్తోందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి లక్ష్మానాయక్, బీసీ సంక్షేమ శాఖాధికారి అంజల, మైనార్టీ సంక్షేమ శాఖాధికారి సురేష్‌కన్నా, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల భూ దందా

- 21 ఎకరాల ఆక్రమణకు యత్నం
- మార్కెట్ విలువ సుమారు రూ.32 కోట్లు
- సిట్‌కు బాధితుడి ఫిర్యాదు



టీడీపీ నేతలు అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్న భూమి

మార్కాపురం: అధికారంలో ఉన్నన్నాళ్లూ భూ కబ్జాలకు పాల్పడిన టీడీపీ నేతలు ప్రస్తుతం అధికారంలో లేకపోయినప్పటికీ బరితెగించి భూ దందాలకు పాల్పడుతున్నారు. ఒక ప్రైవేటు వ్యక్తి భూమిని అడ్డగోలుగా ఆన్‌లైన్ రికార్డుల్లో మార్పించి పట్టాదారు పాసుపుస్తకాల్లో కూడా వారి పేరుపై మార్చుకునేందుకు ప్రయత్నిస్తూ అడ్డంగా దొరికిపోయారు. విషయం తెలుసుకున్న సదరు భూ యజమాని మార్కాపురంలో సిట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో టీడీపీ నేతల భూ ఆక్రమణ వ్యవహారం బట్టబయలైంది. మార్కాపురం నియోజకవర్గానికి చెందిన టీడీపీ ముఖ్యనేత, ఆయన సోదరుడు దరిమడుగు దగ్గర జాతీయ రహదారి సమీపంలో ఉన్న 21 ఎకరాల 3 సెంట్ల భూమిపై కన్నేశారు. తమకు అనుకూలమైన వ్యక్తుల నుంచి ఆ భూమి కొన్నట్లు డాక్యుమెంట్లు సృష్టించారు. టీడీపీ ప్రభుత్వంలో భూ యజమానికి తెలియకుండా వారి పేరుపై ఆన్‌లైన్‌లో మార్చుకున్నారు. ఇటీవల ఆ భూమికి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కలెక్టర్, మార్కాపురం తహసీల్దార్‌కు అర్జీ పెట్టుకున్నారు. అయితే, ఈ ఏడాది మార్చిలో తహసీల్దార్ విచారణ జరిపి ఆ భూమి నిషేధిత (చుక్కల భూమి) జాబితాలో ఉందని, పాస్‌పుస్తకాలు ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పాడు. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం ఎకరా సుమారు రూ.1.50 కోట్లు పలుకుతోంది. ఈ లెక్కన ఆ భూమి విలువ సుమారు 32 కోట్ల రూపాయలు ఉంటుంది. అంత విలువైన భూమిని కబ్జా చేసేందుకు వేసిన స్కెచ్ బెడిసికొట్టింది. విషయం తెలుసుకున్న దోర్నాల మండలం హసానాబాద్‌కు చెందిన భూ యజమాని నాగేశ్వరరావు కబ్జాకు గురికాబోతున్న తన పొలం వారసత్వంగా తనకు వచ్చిందని, దాన్ని కాజేసేందుకు యత్నిస్తున్నారని మార్కాపురంలోని సిట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మార్కాపురం నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేతల కబ్జాపర్వం బయటపడింది. సర్వే నంబర్ 1119లో ఉన్న తన పొలం తన తండ్రి ముత్తాతల నుంచి తనకు వారసత్వంగా వచ్చిందని, ఇదే విషయం అడంగల్‌లో కూడా ఉందని భూయజమాన్ని ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దొంగ డాక్యుమెంట్లతో మార్కాపురం టీడీపీ నేతలు వారసత్వంగా వారికి వచ్చినట్లు అన్యాయంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని వివరించారు. విచారణ జరిపి తనపేరుపై ఆన్‌లైన్ చేయాలని కోరారు. ఆ మేరకు సిట్ అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ వ్యవహారం మార్కాపురం నియోజకవర్గంలో ప్రస్తుతం తీవ్ర చర్చకు దారితీస్తోంది. టీడీపీ నేతల అక్రమ రిజిస్ట్రేషన్లు, భూ కబ్జాలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జనగళం



సొంతింటి కల నెరవేరింది



మాది చింతలపాలెం గ్రామం. 11 మందితో కలిసి పాత ఇంట్లో జీవించేవాళ్లం. కూలి పని చేస్తేనే కుటుంబ పోషణ జరిగేది. సొంతిల్లు కట్టుకోవాలని ఆశ ఉన్నా.. ఆర్థిక స్తోమత లేదు. ప్రభుత్వం ఇంటి పట్టా ఇచ్చి ఇల్లు మంజూరు చేసింది. ప్రభుత్వం ఇచ్చిన బిల్లుతో పాటు దాచిపెట్టుకున్న కొద్దిపాటి డబ్బుతో ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేశాం. ఇప్పుడు మా ఇల్లు గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉంది. సీఎం జగన్ వల్లే మా సొంతింటి కల సాకారమైంది. నా మనువడు లాంటి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– మేడికొండ పెదలక్ష్మమ్మ, చింతలపాలెం, జరుగుమల్లి మండలం

ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ ఊపిరినిచ్చాయి



మాది పేద కుటుంబం. కిడ్నీలో రాళ్లు ఉండటంతో ఆరోగ్యశ్రీ ద్వారా ఒంగోలు నల్లూరి నర్సింగ్ హోంలో శస్త్ర చికిత్స చేయించుకున్నా. కిడ్నీ పనితీరు సరిగా లేదని, తక్కువగా ఉందని, జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించి ఇంటికి పంపించారు. కొంతకాలానికి బీపీ నియంత్రణ సరిగా లేకపోవడంతో హైదరాబాదులోని గ్లోబల్ వైద్యశాలలో పరీక్షలు చేయించుకున్నా. గుండెలో రెండు వాల్వులు బ్లాక్ అయ్యాయని తెలిపారు. ఒకసారి ఆరోగ్య శ్రీ పరిధిలోకి రావడంతో రెండో సారి వీలు కాలేదు. అప్పు చేసి హైదరాబాద్ గ్లోబల్ వైద్యశాలలో శస్త్ర చికిత్స చేయించుకున్నా. ఆ బిల్లులు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1,25,000 మంజూరు చేశారు. జగనన్న ఊపిరి పోశారు. ఆయనకు రుణపడి ఉంటాం.

– కోలా శ్రీనివాసరావు, చింతలపాలెం, జరుగుమల్లి మండలం

కల సాకారమైంది



సొంతింటి కల సాకారం అవుతుంటే సంతోషంగా ఉంది. ఇప్పటి వరకు చాలీచాలని గదిలో ఉన్నాం. జగనన్న ఆడపడుచుల పేరున ఉచితంగా నివేశన స్థలం ఇచ్చి పట్టాతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టడం మా లాంటి వాళ్లకు ఎంతో ఆసరాగా నిలిచింది. ముఖ్యమంత్రి జగనన్న ఇంటి స్థలాలు ఇవ్వడం కోసం తీసుకున్న సాహసోపేత నిర్ణయం అద్భుతం. పేదల సొంతింటి కల ఎన్నో ఏళ్లుగా కలగానే ఉంది. నేడు ఆ కల సాకారం అవుతుంటే పేదల ఇంట్లో వెలుగులు నింపినట్టుంది. జగనన్నకు రుణపడి ఉంటాం.

– కె.మంజులాదేవి, తువ్వపాడు, కొనకనమిట్ల మండలం

15 ఏళ్లుగా బాడుగ ఇల్లే.. ఎట్టకేలకు కల నిజమైంది



సొంతిల్లు లేక 15 ఏళ్లుగా బాడుగ ఇంట్లోనే ఉంటున్నాం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్జీ ఇస్తే అర్హత ఉందని అధికారులు గుర్తించి జమ్ములపాలెం జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేశారు. అందులో గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలు ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందింది. డ్వాక్రా ద్వారా కొంత రుణం తీసుకుని ఇల్లు నిర్మించుకున్నాం. సొంతింటి కల జగనన్న ద్వారా సాకారమైంది. జీవితాంతం జగనన్నకు రుణపడి ఉంటాం.

– యిన్నర్ల పద్మ, జమ్ములపాలెం, టంగుటూరు మండలం

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు



టంగుటూరు 3వ సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపులో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకున్నా. వలంటీరు మా ఇంటికి వచ్చి అవసరమైన పత్రాలు తీసుకుని వెళ్లాడు. అధికారులు పరిశీలించి వెంటనే ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారు. నేను కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటా. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే సెలవు పెట్టుకుని కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. జగనన్న సీఎం అయ్యాక సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి అన్ని సేవలు అందిస్తున్నారు. నిజంగా ఇటువంటి సదుపాయం గతంలో మేము చూడలేదు. సీఎం జగనన్నకు ధన్యవాదాలు.

– తన్నీరు బాబు, టంగుటూరు

విస్తారంగా వర్షం.. రైతన్న హర్షం

- జిల్లాలో రెండు రోజుల్లో సరాసరిన 25.3 మి.మి వర్షపాతం నమోదు
- మర్రిపూడి మండలంలో అత్యధికంగా 44.8 మి.మీ



వర్షాలకు కళకళలాడుతున్న పొగతోట

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో రబీ పంటలకు మేలు జరుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 38 మండలాలకుగానూ 37 మండలాల్లో సరాసరిన రెండు రోజుల నుంచి 25.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని పుల్లల చెరువు మండలం తప్ప మిగిలిన మండలాల్లో వర్షపాతం నమోదైంది. బుధవారం నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. మర్రిపూడి మండలంలో అత్యధికంగా 44.8 మిల్లీమీటర్ల వర్షం కురవగా, హెచ్‌ఎం పాడు 40, ఎస్.కొండ 37.2, కొత్తపట్నం 36.4, పొదిలి 29.6, వెలిగండ్ల 26.2, కొండపి 25.6, జరుగుమల్లి 23.8, పామూరు 20.2, టంగుటూరు 20, ఎస్.ఎన్.పాడు 18.6, తాళ్లూరు 18.2, పొన్నలూరు 18, ఒంగోలు 17.8, చీమకుర్తి 16, ముండ్లమూరు 15.2, పీసీ పల్లి 13.4, రాచర్ల 13.2, యర్రగొండపాలెం 13, కనిగిరి 12.6, బేస్తవారిపేట 10.2, కురిచేడు 10, దర్శి, కొమరోలు 8.2, కేకే మిట్ల 7.4, కంభం 6.4, త్రిపురాంతకం 6.2, సీఎస్ పురం 5.2, మద్దిపాడు 4.8, మార్కాపురం 3.6, దొనకొండ 3, పెద్దారవీడు 2.4, ఎన్‌జీ పాడు 2, గిద్దలూరు 2, తర్లుపాడు 1.8, అర్ధవీడు 1.2, దోర్నాల 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కూడా ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉండటం, పలు చోట్ల విస్తారంగా వర్షాలు కురవడంతో వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని రైతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

రైల్వే ప్రైవేటీకరణ తగదు



ఒంగోలు రైల్వే స్టేషన్ వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: దేశంలోని కోట్లాది మంది నిరుపేద ప్రజలకు సౌకర్యంగా ఉన్న రైల్వేలను ప్రైవేటీకరించడం సరైన చర్య కాదని సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఎం.అయ్యపరెడ్డి అన్నారు. గురువారం ఒంగోలు రైల్వే స్టేషన్ ఎదురుగా నిర్వహించిన నిరసనలో ప్రసంగించారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల ఆస్తులను కార్పొరేట్‌లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎల్ఐసీ, విమానాశ్రయాలు, రైల్వేలను ప్రైవేట్ శక్తులకు అప్పగించడం వలన దేశంలోని నిరుపేద, సామాన్య ప్రజలకు నష్టం కలుగుతుందన్నారు. రైల్వేలను ప్రైవేటీకరించిన కొన్ని దేశాలు ఎన్నో ఇబ్బందులకు గురౌతున్నాయని, ఏ రైలు ఎప్పుడు వస్తుందో చెప్పలేని దుస్థితి నెలకొని అక్కడి ప్రజలు అగచాట్లు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా మోదీ రైల్వే ప్రైవేటీకరణకు స్వస్తి పలికాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జీవీ కొండారెడ్డి, బీవీ రావు, సి.హెచ్ రాంబాబు, తంగిరాల మహేష్, ఎస్‌డీ హుసేన్, తంబి శ్రీనివాసులు, కొర్నపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



ఆవిష్కరణ గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న ప్రొఫెసర్లు

ఒంగోలు సెంట్రల్: సమాజానికి ఉపయోగపడేలా నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. క్విస్ కాలేజీలో గురువారం ఐడియా ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన టెక్ ఎక్స్‌పో సందర్శించారు. తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనం కలిగేలా సమాజ ఉపయోగానికి దోహద పడేలా వినూత్న ఆవిష్కరణల రావాల్సిన అవసరం ఉందన్నారు. అత్యాధునిక డిజిటల్ లైట్ సింథసిస్ అధారిత 3–డి ప్రింటింగ్ ద్వారా వివిధ ఉత్పత్తుల రూపకల్పన, క్యాలిబ్రి మినీ 3–డి స్కానర్, పి.సి. బి మెషీన్, సీఓ–2 లేజర్ కటింగ్ మెషీన్, సి.ఎన్.సి ఉడ్ రూటర్ మెషీన్ల ద్వారా తమ విద్యార్థులు చేసిన ఆవిష్కరణలు గురించి యాజమాన్య సభ్యులు వివరించారు. సరికొత్త ఆవిష్కరణల హబ్‌గా ప్రకాశం జిల్లాకు గుర్తింపు తెచ్చేలా మరింత కృషి చెయ్యాలని కలెక్టర్ సూచించారు. కాలేజీ చైర్మన్ డాక్టర్ సూర్య కళ్యాణ చక్రవర్తి , ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, డైరెక్టర్ బి.వి సుబ్బారావు, జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మెనేజర్ బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నకిలీ పట్టాల కేసులో ఐదుగురు అరెస్టు

అర్థవీడు(కంభం): నకిలీ పట్టాలు, పాసు పుస్తకాలు తయారు చేసి రైతులను మోసం చేస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే పొలాలకు పట్టాలు ఇప్పిస్తాని చెప్పి తమ వద్ద డబ్బులు తీసుకున్నారని నాలుగు నెలల క్రితం అర్థవీడు తహసీల్దారు కార్యాలయంలో పలువురు ఫిర్యాదు చేశారు. రైతులు ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు సదరు కేసులో నిందితులైన దద్దనాల క్రిష్ణారెడ్డి , అన్నపునాగరజు, తొండమల వెంకట వరప్రసాద్, చిట్టేటి నాగరాజు, గుమ్మడాల శ్రీనివాసులను బుధవారం రాత్రి అదుపులోనికి తీసుకొని గురువారం గిద్దలూరు కోర్టులో హాజరుపరిచారు. నిందితుల్లో చిట్టేటి నాగరాజు, గుమ్మడాల శ్రీనివాసులు తలారీలుగా పనిచేస్తుండగా, అన్నపు నాగరాజు, తొండమల్ల వెంకటప్రసాద్‌లు గతంలో లైసెన్స్ సర్వేయర్లుగా పనిచేశారు.

పది సవర్ల బంగారం చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

సంతమాగులూరు(అద్దంకి రూరల్): ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి పది సవర్ల బంగారం అపహరించారు. ఈ ఘటన సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వంకాయల శేషయ్య, పేరమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. బీరువా తాళం పగలగొట్టి బంగారు ఆభరణాలు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

భూ వివాదాల్లో లోతుగా విచారణ



నేర సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు



మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

- ఉద్యోగస్తులపై కేసులుంటే ఆయా శాఖలకు రిపోర్టులు
- సాంకేతికతను వినియోగించుకొని కేసులను ఛేదించాలి
- రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు
- నేర సమీక్షలో ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులపై పీడీ చట్టం ప్రకారం చర్యలు తీసుకునేందుకు ప్రతిపాదనలు పంపించాలని పోలీసు అధికారులకు ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, కఠినంగా శిక్షించాలని చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన కేసులు, పీడీ యాక్టు, భూ వివాదాలు, గుడ్ ట్రయల్ మానిటరింగ్‌లకు సంబంధించి సమీక్షించిన ఎస్పీ కేసుల పురోగతి, ప్రస్తుత స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కేసులను ఛేధించే విషయంలో దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. భూ వివాదాలకు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన కేసుల్లో లోతుగా దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేయాలని స్పష్టం చేశారు. తీవ్రమైన నేరాల షీట్స్‌లోని నిందితులపై నిరంతర నిఘా ఉంచాలని, యాక్టివ్‌గా ఉన్న వారిని బైండోవర్ చేయాలని సూచించారు. పాత నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలన్నారు. గతంలో జరిగిన ఎన్నికలకు సంబంధించిన కేసులను సమీక్షించి, రానున్న ఎన్నికలకు సమాయత్తం కావాలన్నారు. ఎన్నికలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగస్తులపై కేసులు నమోదై ఉంటే ఆయా శాఖల అధికారులకు రిపోర్టులు పంపించాలని చెప్పారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలని, సమగ్ర విచారణ చేపట్టడం ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.కేసుల విచారణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కేసుల విచారణలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని, పకడ్బందీగా, పారదర్శకంగా విచారణ చేపట్టాలని చెప్పారు. ప్రతి కేసులోనూ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలన్నారు. హత్యలు, మహిళలపై జరిగే నేరాలు, దొంగతనాలు, ఎన్డీపీఎస్, పోక్సో, లైంగిక దాడులు తదితర తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో అన్నీ కోణాల్లో విచారణ పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలని, ఎక్కువ శాతం కేసుల్లో శిక్షలు పడేలా చూడాలన్నారు. కోర్టుల్లో శిక్షల శాతం పెరిగేలా కృషి చేయాలని చెప్పారు. దొంగతనాలకు పాల్పడిన వారి నుంచి సొత్తు రాబట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలకు కారణాలను విశ్లేషించి కట్టడికి కట్టుదిట్టమైన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని కఠినంగా శిక్షించాలన్నారు. హ్యూమన్‌రైట్స్, ఎస్సీఆర్సీ, ఎస్సీఆర్సీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా కమిషన్, ఇతరా కమిషన్ల నుంచి వచ్చిన పిటిషన్లకు వెంటనే తగిన సమాధానం ఇవ్వాలని సూచించారు. డీపీఓకు సంబంధించిన పెండింగ్ రిప్లయ్‌లను త్వరితగతిన పంపించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పీ (క్రైం) ఎస్‌వీ శ్రీధర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, డీఎస్పీలు వి.నారాయణ స్వామిరెడ్డి, రామరాజు, అశోక్‌వర్ధన్, వీర రాఘవ రెడ్డి, వి.శ్రీనివాసులు, సీహెచ్ శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ షేక్ షెహబాజ్, డీసీఆర్బీ సీఐ ధర్మేంద్ర బాబు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో వేగంగా ఇళ్ల నిర్మాణం



గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు సెంట్రల్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు నిర్దిష్ట కాల వ్యవధిలో కచ్చితంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవన్‌లోని సమావేశ మందిరంలో గురువారం హౌసింగ్ ఈఈలు, డీఈలు, ఏఈలతో గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గృహ నిర్మాణాలు జనవరి 15వ తేదీలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో నిర్దేశించిన లక్ష్యాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గృహాలు మంజూరై నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు నోటీస్‌లు ఇచ్చి, పనులు మొదలుపెట్టేలా చూడాలన్నారు. లేని పక్షంలో పట్టా రద్దు చేస్తామని హెచ్చరించారు. కొంత మంది లబ్ధిదారులకు ఇసుక, సిమెంట్, ఇనుము అందించామని, నిర్మాణాలు ప్రారంభించకపోతే ఇంటిని రద్దు చేసి సామగ్రిని రికవరీ చేస్తామనే విషయాన్ని తెలియజెప్పాలన్నారు. నిర్మాణాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపు విషయంలో లబ్ధిదారులకు ఉన్న అపోహలను తొలగించాలని ఏఈలను కలెక్టర్ ఆదేశించారు. గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు నిర్మాణాలు పూర్తయ్యేలోపు ఉపాధి హామీ పథకం పనుల్లో 90 రోజులు కచ్చితంగా కల్పించాలని చెప్పారు. మ్యాజిక్ సోక్ పిట్స్‌కు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆప్షన్–3 నిర్మాణాల్లో లబ్ధిదారులు ఎంపిక చేసుకున్న ఏజెన్సీలు ప్రభుత్వం ఇచ్చిన యూనిట్ కాస్ట్‌లో లబ్ధిదారులు కోరిన విధంగా గృహాలు నిర్మించడానికి సాధ్యాసాధ్యాలపై కమిటీ ఏర్పాటు చేసి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే పీడీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. నిర్మాణాల పురోగతిలో వెనకబడిన మండలాలపై డీఈలు, ఈఈలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ పేరయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మీకు మీరే.. మాకు మేమే!



ఓ వెంచర్‌లో నిర్మిస్తున్న టీడీపీ కార్యాలయం



అద్దె భవనంలో నిర్వహిస్తున్న పార్టీ కార్యాలయం

- కురిచేడు మండల టీడీపీలో తారాస్థాయికి చేరిన ఆధిపత్య పోరు
- వేర్వేరుగా పార్టీ కార్యాలయాలు నిర్వహిస్తున్న రెండు వర్గాలు
- ఫలించని దామచర్ల సయోధ్య యత్నాలు

కురిచేడు: దర్శి నియోజకవర్గంలోని కురిచేడు మండలంలో టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. ఇప్పటికే పార్టీ పరిస్థితి దిగజారిందని, ఆధిపత్య పోరుతో మరింత అభాసుపాలు చేస్తున్నారని సొంత పార్టీ కార్యకర్తలే విమర్శిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల అనంతరం టీడీపీ మండల అధ్యక్షులు, మాజీ అధ్యక్షుడు రెండు వర్గాలుగా విడిపోయి వేరు కుంపట్లు పెట్టారు. ఇరువర్గాల వారు మండల కేంద్రంలో ఏర్పాటు చేసుకున్న రెండు పార్టీ కార్యాలయాలకు గ్రామల్లోని నాయకులను ఆహ్వానిస్తూ ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు నాయకులు రెండు కార్యాలయాలకూ వెళ్తుండగా.. ఇంకొందరు ఎటూ వెళ్లకుండా దూరంగా ఉంటున్నారు. మండల కేంద్రానికి చెందిన నాయకులు.. గ్రామ స్థాయి నేతలను కలుపుకొని ఒక వర్గంగా ఏర్పడిన నేపథ్యంలో వారు ఇక్కడ పెత్తనం చేయడాన్ని వైరి వర్గం వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఓ వర్గం ఇప్పటికే ఒక పార్టీ కార్యాలయాన్ని అద్దె భవనంలో ఏర్పాటు చేయగా, మరో వర్గం నాయకులు దర్శి రోడ్డులోని ఓ వెంచర్‌లో సొంతగా స్థలం కొనుగోలు చేసి పార్టీ కార్యాలయం నిర్మిస్తున్నారు. ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

రైజ్‌కు జాతీయ పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న కళాశాల డైరెక్టర్ సుబ్బారావు

ఒంగోలు సెంట్రల్: అఖిల భారత సాంకేతిక విద్యామండలి సహకారంతో ఎడ్యుస్కిల్స్ ఫౌండేషన్ గోవాలో నిర్వహించిన జాతీయ స్థాయి విద్యాసంస్థల సదస్సులో రైజ్ క్రిష్ణ సాయి కళాశాలకు ఆరు ఉత్తమ పురస్కారాలు లభించినట్లు కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. ఉత్తమ డైరెక్టర్‌గా డాక్టర్ ఏవీ భాస్కర్‌రావు, బెస్ట్ పెర్‌ఫార్మింగ్ ఇన్‌స్టిట్యూట్ అవార్డులు (క్రిష్ణసాయి, గాంధీ కళాశాలకు), ఎడ్యుస్కిల్ ఇంటర్న్‌షిప్‌లో 33వ ర్యాంక్ అవార్డులు దక్కినట్లు చెప్పారు. అవార్డులను అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) విశ్రాంత చైర్మన్ డాక్టర్ కె.కె అగర్వాల్, ఎడ్యుస్కిల్స్ వ్యవస్థాపకుడు శిభజిత్ జగ్దేవ్‌లు అందించారు. డైరెక్టర్‌కు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, చైర్మన్ ఇస్కాల చిన రంగమన్నార్, ట్రెజరర్ శిద్దా భరత్, కళాశాల వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సీఎం జగన్‌ను సత్కరించిన నేతలు



సీఎం జగన్‌ను సన్మానిస్తున్న సంఘు బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ది పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు చల్లా చంద్రయ్య , ఏపీజేఈఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకట రామిరెడ్డి గురువారం సీఎంకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈమేరకు ఒంగోలుకు చెందిన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల రాధాకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్ మెంట్‌లో తమ అసోసియేషన్‌ను గుర్తింపు సంఘం హోదా పత్రాన్ని జీవో 123 ద్వారా అందించినందుకు ధన్యవాదాలు చెప్పారన్నారు. గుర్తింపు వచ్చేందుకు సహకరించిన సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ ద్వారకా తిరుమల రావు, మంత్రివర్యులు పినిపే విశ్వరూప్, సంఘ గౌరవ అధ్యక్షులు , కమలాపురం ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్, కార్యదర్శి జె. ఎం.నాయుడు, డీఎస్పీ రావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు డీఈ కొండలు, అర్జున, సంయుక్త కార్యదర్శి రాధా క్రిష్ణ, గుంటూరు, తిరుపతి జిల్లా కార్యదర్శులు జయరావు, నరసింహులు, నెల్లూరు అధ్యక్షుడు సుబ్బారావు తదితరులున్నారు.

భవిత కేంద్రం పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న మల్లికార్జున

పొదిలి: స్థానిక భవిత కేంద్రాన్ని రాష్ట్ర సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఐఈ కోఆర్డినేటర్ జి.మల్లికార్జున గురువారం సందర్శించారు. కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. గ్రూప్ హియరింగ్ ఎయిడ్ ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు. కేంద్రంలోని ఉపాధ్యాయులు, సిబ్బంది పనితీరు బాగుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ ఎం.రమేష్, రిసోర్సు పర్సన్ షాహిదా పాల్గొన్నారు.

మహిళల కబడ్డీ జట్టు ఎంపిక



మహిళా కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు

సింగరాయకొండ: మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా మహిళల కబడ్డీ జట్టును ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్ తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి చెరుకూరి పుల్లయ్య సమక్షంలో ఎంపిక పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. వీరికి ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు పాకలలో శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 29 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు కర్నూలు జిల్లా గోనెగండ్లలో నిర్వహించనున్న 70వ ఆంధ్ర రాష్ట్ర అంతర్ జిల్లా మహిళల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపిక పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు పిల్లి హజరత్తయ్య, లలిత పర్యవేక్షించారు.

మహిళల కబడ్డీ జట్టు..

జె.కోమలి(ఇంకొల్లు), కె.భూమిక, వి.అర్చన, కె.నందిని, వి.అపర్ణ, కె.విజయలక్ష్మి, కె.మేరీ స్వీటీ, సీహెచ్ బ్లెస్సీ, అమూల్య(పాకల), సీహెచ్ బంగారమ్మ(క్రొత్తపట్నం), వీవీ సింధూరి(పీసీ పల్లి), జి.రమ్య, ఎన్.మునిశారద, ఎల్.చందుప్రియ(ఒంగోలు), ఆర్.వెంకట్ దీపిక, డి.యామిని(అడివిపాలెం).

నీళ్లొస్తున్నా.. నిందలేల?

- కొండపి మండలం మిట్టపాలెంలో టీడీపీ నీళ్ల రాజకీయం
- సమస్య లేకపోయినా మహిళలతో నిరసన.. ఆపై విష ప్రచారం



కొండపి : మిట్టపాలెంలో బిందెలతో నవ్వులు చిందిస్తూ నిరసన తెలుపుతున్న మహిళలు

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలం మిట్టపాలెం గ్రామంలో టీడీపీ నాయకులు నీళ్ల పేరుతో రాజకీయం చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేశారు. గురువారం రోజు మహిళలు బిందెలు పట్టుకుని రోడ్డెక్కారని, దీంతో ట్రాఫిక్ జామ్ అయిందంటూ ఎల్లో మీడియాలో ప్రచారం చేశారు. గత ఆరు నెలలుగా గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా మంచినీటి కుళాయిలకు నీరు సరఫరా కావడం లేదని చెప్పుకొచ్చారు. వాస్తవానికి గ్రామానికి రామతీర్థం పైపులైన్ ద్వారా నీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటి లభ్యత తగ్గడంతో గ్రామంలోని 200 ఇళ్లకు విడతల వారీగా మూడు రోజులకు ఒకసారి నీరు సరఫరా అయ్యేలా మూడు వాల్వ్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో వాల్వ్ ద్వారా ఒక్కో రోజు నీరు సరఫరా చేస్తున్నారు. టీడీపీ నాయకులు మాత్రం గ్రామంలో నీరు సరఫరా కాలేదంటూ సోషల్‌మీడియా ద్వారా రెండు రోజుల నుంచి ప్రచారం చేస్తూ.. చివరికి గురువారం తమకు అనుకూలమైన మహిళలకు బిందెలు ఇచ్చి మరీ రోడ్డు ఎక్కించి తమాషా చూశారు. మహిళలు నవ్వుతూ నిరసన తెలుపుతున్నట్లు ఫొటోలకు ఫోజులివ్వడం గమనార్హం. గ్రామంలో ఆరునెలలుగా నీరు సరఫరా కాకపోతే సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన దాఖలాలు లేవు. ఎంపీడీఓ రమణమూర్తికిగానీ, పంచాయతీ కార్యదర్శి రత్నప్రభకుగానీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రసూల్‌కుగానీ నీటి సమస్యపై ఎటువంటి సమాచారం లేదు. మిట్టపాలెంలో నీటి ఎద్దడి, మహిళల నిరసన అంటూ జరిగిన ప్రచారాన్ని చూసి అవాక్కవడం అధికారుల వంతయింది. లేని సమస్యను ఉన్నట్లుగా ఎలా ప్రచారం చేస్తారని అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిని బట్టి టీడీపీ కుటిల నీటి రాజకీయం అర్థమవుతోందని, కొన్ని అదృశ్య శక్తులు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించి ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

పోలీసుల అదుపులో అనుమానాస్పద వ్యక్తి

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని తూర్పు వీధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని స్థానికులు గుర్తించి గురువారం పోలీసులకు అప్పగించారు. వీధుల వెంట అనుమానాస్పదంగా తిరుగుతున్న గుర్తుతెలియని వ్యక్తిని స్థానికులు చితకబాది పోలీసులకు సమాచారం అందించారు. అనుమానితుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డును బట్టి పశ్చిమ బెంగాళ్‌లోని దినాస్‌పూర్ జిల్లా కుతుబ్‌పూర్‌కు చెందిన కోమల ముర్ముగా పోలీసులు గుర్తించారు.